# ఆషాఢం సేల్

**శ్రీ వారాహి సిల్క్స్**

కంచిపట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ధర్మవరం పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

మంగళగిరి పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఉప్పాడ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

బెనారస్ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

కుబేర పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఆర్‌గంజి పట్టు
(2000లకు పైగా డిజైన్స్)

కేటలాక్ శారీస్
(2000లకు పైగా డిజైన్స్)

ఫ్యాన్సీ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

డిజైనర్ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

వర్క్ శారీస్
(2500లకు పైగా డిజైన్స్)

ప్యూర్‌సిల్క్
(5000లకు పైగా డిజైన్స్)

ప్రింటెడ్ సిల్క్
(2000లకు పైగా డిజైన్స్)

లంగావోణీ సెట్‌లు
(2000లకు పైగా డిజైన్స్)

లెహంగాస్
(2000లకు పైగా డిజైన్స్)



**రూ.5000/-**
**షాపింగ్ చేయండి..**




***వెండి కాయిన్ పొందండి.***

కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం




సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 8-7-2025
సంపుటి: 21 సంచిక: 90
పేజీలు: 8 వెల: రూ.1




# అత్యుత్సాహం చూపారు.. అడ్డంగా దొరికిపోయారు!

- విచారణ ఆయనపైనే.. వెళ్లింది ఆయనతోనే!
- నవ్వులాటగా మారిన బీసీ సంక్షేమ శాఖ విచారణ తంతు
- ఆరోపణలకు గురైన వారికి ముందుగానే సమాచారం
- ఫొటో షూట్‌తోనే మమ అనిపించేసిన ఏబీసీడబ్ల్యూవో-1
- బదిలీల్లోనూ అంతులేని అవకతవకలు
- వాటికి ప్రజాప్రతినిధుల సిఫార్సు అన్న ముద్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సంక్షేమ శాఖపై వస్తున్న ఆరోపణలు, పత్రికల్లో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని చాటుకునేందుకు ఆ శాఖ అధికారులు అత్యుత్సాహం చూపారు. తామే అడ్డంగా దొరికిపోయారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారినే వెంటబెట్టుకు వెళ్లి విచారణ తతంగం జరపడం విస్మయం కలిగించింది. 'అతడి కబందహస్తాల్లో బీసీ శాఖ బందీ!' అనే శీర్షికతో సంచలన సాయంకాల పత్రిక సత్యంలో సోమ వారం ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆ శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారి అయిన డీబీసీడబ్ల్యూవోను వివరణ కోరడంతో భుజాలు తడుమున్న సదరు అధికారి తక్షణమే విచారణ తతంగాన్ని నడిపే బాధ్యతను ఏబీసీడబ్ల్యూవో-1 (అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్) చంద్రమౌళికి అప్పగించారు.

**ముందుగానే సమాచారమిచ్చి..**

ఆ మేరకు రణస్థలం మండలం జీరుపాలెం బాలికల వసతి గృహ సందర్శనకు బయల్దేరిన ఏబీసీడబ్ల్యూవో-1 చంద్రమౌళి ఆ సమాచారాన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్న, శాఖతో సంబంధం లేని ఆచారికి ముందుగానే చేరవేశారు. దాంతో సదరు ఆచారి హాస్టల్ వార్డెన్ గుణవతిని వెంటబెట్టుకుని కారులో జీరుపాలెం వసతి గృహానికి చేరుకున్నారు. అక్కడ చంద్రమౌళి వార్డెన్ గుణవతి, హాస్టల్లో ఉంటున్న విద్యార్థినులతో గ్రూప్ ఫొటోలు తీసుకుని విచారణ అయ్యిందని పించేశారు. ఈ తతంగం జరుగుతున్నంత సేపు షాడో వార్డెన్‌గా వెలగబెడుతున్న ఆచారి అక్కడే కారులో ఉండటం చర్చనీయాంశమైంది. ఏది కాదని చెప్పాలనుకున్నారో.. అదే నిజమని తేలిపోయింది. అనధికారికంగా జీరుపాలెం, కేవీ పేట వసతి గృహాల నిర్వహణను వార్డెన్ గుణవతికి బదులు ఆచారి చూస్తున్నట్టు తేటతెల్లమైంది. 'సత్యం'లో వచ్చిన కథనంపై స్పందించిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డీబీసీడబ్ల్యూవోను వివరణ కోరినట్టు తెలిసింది. ఇప్పటికే ఈ శాఖలో జరిగిన బదిలీలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఏ ప్రాతిపదికన బదిలీలు చేశారన్న విషయాన్ని తెలియజేస్తూ మొత్తం జాబితా ఇవ్వాలని కోరడంతో ఆ శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

**తమ అక్రమాలకు సిఫార్సుల ముసుగు**

బీసీ శాఖలో అవినీతికి అంతులేకుండా పోయింది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే.. అధికార పార్టీ నాయకులు చెప్పడం వల్లే చేశానని ఆ శాఖ జిల్లా అధికారి సమాధానమిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని బాధితులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సదరు అధికారి పట్టించుకోలేదు. ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలనూ ఖాతరు చేయడంలేదు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేసి డబ్బు దండుకున్నారని ఆ శాఖ ఉద్యోగులే బహిరంగంగా చెబుతున్నారు. కొందరిని బదిలీ చేసినట్టే చేసి డిప్యూటేషన్లతో వెనక్కి తీసుకొచ్చారు. పరిపాలన సౌలభ్యం కోసం బదిలీలు చేసినట్టు చెబుతున్న శాఖ అధికారి ఉన్నతాధికారులకు చెప్పకుండానే ఫ్రీ కౌన్సెలింగ్ పేరుతో బదిలీ కావాల్సిన అధికారులు, ఉద్యోగులను పిలిపించి వారి నుంచి ఆప్షన్ తీసుకొని సంతకాలు పెట్టించి పంపించినట్టు తెలిసింది. ఇదంతా గుట్టుగా జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో బదిలీలు - మిగతా చివరి పేజీలో



జీరుపాలెం వసతిగృహంలో అధికారులతో పాటు ఆచారి

# ఘనంగా వైఎస్సార్ జయంతి



### ⭐ జగన్ అభిమానులు రక్తదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మంగళవారం వైకాపా శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలకు వైఎస్సార్ రూపకల్పన చేశారన్నారు. పేదరిక నిర్మూలనకు కృషిచేసిన మహానుబావుడని కొనియాడారు. వైఎస్సార్ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో జగన్ అభిమానులు, యువజన విభాగం నాయకులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రిమ్స్ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, వైకాపా యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్, పార్టీ సీనియర్ నాయకులు, చిట్టి జనార్ధన, గొండు కృష్ణమూర్తి, మండవిల్లి రవి, అంబటి శ్రీనివాస రావు, ముంజేటి కృష్ణ, మార్పు పృధ్వీ, సీపాన మహేంద్ర, సాధు వైకుంఠరావు, ఎన్ని ధనుంజయ, వైవీ శ్రీధర్, ఎంఎ బేగ్, రౌతు శంకరరావు, పొన్నాడ రుషి, టైలర్ పాపారావు, ముంజేటి కృష్ణమూర్తి, బుక్కూరు ఉమా మహేశ్వరరావు, టి.కామేశ్వరి, సుగుణారెడ్డి, గుంట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# హత్య కేసులో నిందితుడు అరెస్ట్

(సత్యంన్యూస్, కొత్తూరు)



కొత్తూరు మండలం వాసవి గ్రామంలో ఇటీవల జరిగిన హత్యలో నిందితుడ్ని పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు మంగళవారం ఆయన్ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హత్యకు గురైన మిన్నారావు గత కొంతకాలంగా మనగల శంకర్రావుకి దుకాణం వద్ద తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవాడని, ప్రతిరోజు లాగానే ఆ రాత్రి శంకర్‌రావు దుకాణం వద్ద ఇబ్బంది చేస్తుంటే, శంకర్రావు తనకు దగ్గరలో ఉన్న సుత్తితో మిన్నారావు తలపై బలంగా గాయపరిచారు. అనంతరం అదే షాపులో ఉన్న చాకుతో పీకపై దాడి చేసి దుకాణం ఎదురుగా రోడ్డు పక్కన పడేశాడు.

# వైఎస్సాఆర్ విగ్రహానికి నివాళులు

- రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ -



(సత్యంన్యూస్, పలాస)

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకొని పలాస నియోజకవర్గంలోని సీనియర్ వైకాపా నాయకులు దువ్వాడ శ్రీధర్ బాబా, బల్ల గిరిబాబు, జుత్తు నీలకంఠం, మరడ భాస్కర్‌రెడ్డి, కూన హేమాచలం, నవీన్ చౌదరి, గొర్లె వేణుగోపాల్, డబ్బీరు నాగు, బద్రి సీతమ్మ, పడ్డ కాళిదాసు, రాంనరేష్ జినగ, చేపర వినోద్, కాళీ మాస్టర్, నాయవాది శ్యామ్ తదితరులు వైఎస్సార్‌కు ఘన నివాళి అర్పించారు. మంగళవారం కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగా మార్కెట్‌లోని వైఎస్ విగ్రహానికి అభిమానులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి అభిమానులుగా ఆయన బాటలో నడుస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వీరవిధేయులుగా ఉంటామన్నారు. జగన్ అభిమానులుగా ఆయన అడుగులో అడుగు వేస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఆయన వేసే ప్రతి అడుగులో భాగస్వాములవుతామని అన్నారు. రాష్ట్ర చరిత్రలో జగన్ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన వైకాపా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. - సత్యంన్యూస్, న్యూఢిల్లీ



• ఎడిటోరియల్

# అమెరికాలో మనుగడ లేని మూడో పార్టీ!

చాలా కాలం తర్వాత అమెరికాలో కొత్త రాజకీయ పార్టీకి అంకురార్పణ జరుగుతోంది. ప్రపంచ కుబేరుడు, నిన్నటిమొన్నటి వరకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితంగా ఉంటూ, ఎన్నికల్లో ఆయన్ను గెలిపించిన టెస్లా సంస్థ అధినేత ఎలన్ మస్క్ ది అమెరికా పార్టీ స్థాపిస్తున్నట్లు ప్రకటించడంతో అమెరికా ఎన్నికల వ్యవస్థపైకి ప్రపంచం దృష్టి మళ్లింది. ముఖ్యంగా మూడో రాజకీయ పార్టీ ఆ దేశంలో మనుగడ సాధించగలదా? అన్న చర్చ ప్రారంభమైంది. అయితే పార్టీ అధికారికంగా నమోదైనట్లు ఆ దేశ ఫెడరల్ ఎలక్టోరల్ కమిషన్ ఇంకా ధ్రువీకరించలేదు. అలాగే దానికి సంబంధించి ఎలాంటి పత్రాలనూ కమిషన్ నోటిపై చేయలేదు. పార్టీని స్థాపిస్తున్నట్లు మస్క్ ప్రకటించినా పార్టీని ఎవరు నడిపిస్తారు.. దాని స్వరూప స్వభావాలు ఎలా ఉంటాయనే విషయాలను ఆయన వెల్లడించలేదు. అన్ని లాంఛనాలు పూర్తి అయ్యి ది అమెరికా పార్టీని గుర్తిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించిన తర్వాతే అమెరికా రాజకీయ రంగంలో మూడో పార్టీ మనుగడలోకి వస్తుంది. పార్టీ వ్యవస్థాపకుడిగా ఎలన్ మస్క్‌కు ఎంత పేరుప్రఖ్యాతులు ఉన్నా.. ప్రపంచ కుబేరుడైనా అవేవీ ఆయన పార్టీ మనుగడను నిర్దేశించలేవని అక్కడి రాజకీయవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే అమెరికా రాజకీయ, ఎన్నికల వ్యవస్థలను పరిశీలిస్తే శతాబ్దాలుగా ఆ దేశ ప్రజలు రెండు పార్టీల వ్యవస్థనే గౌరవిస్తున్నారు. అమెరికా ఎన్నికల చట్టాలు బహుళ పార్టీ వ్యవస్థకు అనుమతిస్తున్నా.. ప్రజలు మాత్రం ఇప్పటి వరకు రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలను ఆదరిస్తున్నారు. ఫలితంగా ఆ రెండు పార్టీలే పరస్పరం పోటీ పడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములను శాసిస్తున్నాయి. ఒక్కోసారి ఒక్కో పార్టీ అధికారం చెలాయిస్తోంది. ఆ క్రమంలోనే ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆయనకు ముందు గత అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ డెమొక్రటిక్ పార్టీకి చెందినవారు. అమెరికా చరిత్రలో ఇంతవరకు ఒకే ఒక్కసారి ఆ రెండు పార్టీలను కాదని ఇండిపెండెంట్ అభ్యర్థి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనే జార్జ్ వాషింగ్టన్. 1789లో ఎన్నికైన ఆయన 1797 వరకు అధ్యక్ష పదవిలో కొనసాగి మంచి పేరు సంపాదించారు. ఆయన తప్ప మరెవరూ వ్యక్తిగతంగానూ, పార్టీలపరంగానూ ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయారు. అనేకమంది నాయకులు పార్టీలు ఏర్పాటుచేసి ఎన్నికల్లో పోటీ చేసినా ఆ రెండు పార్టీలను మాత్రం ఎదుర్కోలేకపోయారు. ఇంకా చెప్పాలంటే పెద్దగా ప్రభావమే చూపలేకపోయారు. ఒక్కసారి గతంలోకి వెళ్తే.. 1828లో ఏర్పాటైన యాంటీ మసానిక్ పార్టీని అమెరికా చరిత్రలో మొదటిసారి ఏర్పాటైన మూడో పార్టీగా చెప్పవచ్చు. మాసన్రీ సంస్కృతికి వ్యతిరేకంగా ఏర్పడింది. 1840లో దాస్య వ్యవస్థను వ్యతిరేకిస్తూ లిబర్టీ పార్టీ, 1848లో బానిస విధానానికి వ్యతిరేకంగా ఫ్రీ సోయిల్ పార్టీ, 1850లో మైగ్రేషన్, క్యాథలిక్ వ్యతిరేక భావాలతో నో-నథింగ్ పార్టీ, రైతుల హక్కులు, ఫెడరల్ బ్యాంక్ సంస్కరణలు, ప్రత్యక్ష పద్ధతిలో సెనేటర్ల ఎన్నికలకు మద్దతుగా 1890లో పాపులిస్ట్ లేదా పీపుల్స్ పార్టీ, 1912లో సామాజిక న్యాయం, కార్మిక హక్కులు అజెండగా థియోడర్ రూజ్‌వెల్ట్ సారథ్యంలో ప్రొగ్రెసివ్ పార్టీ, 1901లో సోషలిస్ట్ పార్టీ, 1971లో లిబరేషన్ పార్టీ, 1990లో గ్రీన్ పార్టీ, 1995లో రిఫార్మ్ పార్టీ వంటి కొన్ని ప్రత్యేక అజెండాలతో ఏర్పాటై ఎన్నికల్లో పాల్గొన్న పెద్ద ప్రభావం చూపలేకపోయాయి. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.. వీటిలో మూడంటే మూడు పార్టీలే కొంత ప్రభావం చూపించి రెండు ప్రధాన పార్టీల ఓట్లన చీల్చగలిగాయి. అయితే అవి ఎన్నికల ఫలితాన్ని శాసించదగ్గ స్థాయిలో లేకపోవడంతో ఆ పార్టీలు మనుగడ సాగించలేక కాలగమనంలో కలిసిపోయాయి. 1912 అధ్యక్ష ఎన్నికల్లో ప్రొగ్రెసివ్ పార్టీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ మాత్రమే ఈ థర్డ్ పార్టీలన్నింటిలోకి అత్యధికంగా 27 శాతం ఓట్లు సాధించగలిగారు. ఆయన తర్వాత 1992 ఎన్నికల్లో రిఫార్మ్ పార్టీ నుంచి పోటీ చేసిన రాస్ పెరోట్ 19 శాతం ఓటు బ్యాంక్ సంపాదించారు. కాగా 1968లో ఇండిపెండెంట్ పార్టీ అభ్యర్థి జార్జ్ వాలెస్ ఐదు రాష్ట్రాల్లో విజయం సాధించారు. 2000 ఎన్నికల్లో గ్రీన్ పార్టీ అభ్యర్థి రాల్ఫ్ నాడర్‌కు డెమొక్రాట్ల ఓటు చీల్చారనే వాదన ఉంది. 2024లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్‌ఎఫ్‌కే జూనియర్ కర్నల్ వెస్ట్ ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎలాన్ మాస్క్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరం. మస్క్ దక్షిణాఫ్రికాలో జన్మించినందున అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడు కావడం అతిపెద్ద అవరోధంగా మారనుంది.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నరసన్నపేట నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తనయుడు కృష్ణచైతన్య పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, నరసన్నపేట**

## స్మృతి వనం.. స్ఫూర్తిమంత్రం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతి వనం భావితరాలకు స్వాతంత్ర్య స్ఫూర్తి మంత్రంగా నిలుస్తుందని గాంధీ స్మారక నిధి రాష్ట్ర కన్వీనర్ జి.రష్మీ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీమందిరంతోపాటు స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్తలు, 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ప్రతిష్టించడం గొప్ప విషయమన్నారు. జిల్లా పర్యటనకు మంగళవారం విచ్చేసిన ఆమె గాంధీ మందిరాన్ని సందర్శించారు. పోరాటాల పురిటిగెడ్డగా పేరొందిన శ్రీకాకుళం జిల్లాలో స్వాతంత్ర్య స్ఫూర్తితో పాటు గాంధేయ వాదాన్ని బలంగా చాటిచెప్పేందుకు జరుగుతున్న కృషి అభినందనీయమన్నారు. స్మృతి వనం ఏర్పాటుకు దాతలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించడంతో పాటు కమిటీ సమిష్టి కృషితోనే మహత్కార్యం సాధ్యపడిందని ఆమె అభిప్రాయపడ్డారు. భావితరాలకు గాంధీ భావజాలాన్ని మరింతగా అందించేందుకు రానున్న రోజుల్లో గాంధీ స్మారక నిధి, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామన్నారు. స్మృతివనంలో కొలువుదీరిన మహనీయుల విగ్రహాలన్నింటినీ పరిశీలించడంతోపాటు మందిరంలో బాపూజీకి రష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మేడూరి ప్రసాదరావు, బరాటం లక్ష్మణరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడులు స్మృతివనం ఏర్పాటుకు చేసిన ప్రయత్నాన్ని వివరించారు. అనంతరం రష్మీను కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిబుల్లాఖాన్, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, తర్లాడ అప్పలనాయుడు, శాస్త్రిలున్నారు.



## 13న విజయనగరంలో వాకర్స్ క్యాబినెట్ సమావేశం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నడక ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడంలో భాగంగా ప్రాంతీయ క్యాబినెట్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 13న విజయనగరం పట్టణంలో తోష్నివాల్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సారధ్యంలో జరగనున్న తోషినివాల్ 95వ జన్మదిన వేడుకల్లో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వాకర్స్ ఇంటర్నేషనల్‌సంస్థ 102 సంస్థ గవర్నర్ కొంక్యాన మురళీధర్ రావు చెప్పారు. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాబినెట్ సమావేశంకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న వాకర్ క్లబ్స్ ప్రతినిధులంతా కలిసికట్టుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి హాజరవుతున్నారన్నారు. తోశ్నివాల్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఈ క్యాబినెట్‌కు ఆతిథ్యం ఇస్తున్నారన్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో ఉన్న అన్ని నడక సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బివి రవిశంకర్, ఎస్.సంజీవరావు, ఎస్.సంజీవరావు, గేదెల లక్ష్మీ, అంకడాల తవిటన్న తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఎంజీఆర్




**(సత్యంన్యూస్, పాతపట్నం)**

పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హలో ఎమ్మెల్యే ఫోన్ ఇన్ కాల్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఎప్పటినుండో పేరుకుపోయిన కొన్ని సమస్యలు ఎమ్మెల్యే తీసుకురావడంతో వాటిని పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఎల్.ఎన్.పేటలో గల వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మండలంలోని కొత్తపుట్టుగ గ్రామంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల కేంద్రంలో గల ఇచ్చాపురం బస్టాప్ వద్ద గల వైఎస్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతరం ఇచ్చాపురం శ్రీశ్రీశ్రీ అమ్మవారి దేవాలయం వద్ద వైకాపా నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నర్తు చామంతి తదితరులు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, కవిటి**



బరువు తగ్గాలి.. బీపీ తగ్గాలి.. సుగర్ లెవల్స్ తగ్గాలి.. ఏం చేయాలి..? చాలామంది ఈమధ్య పాటిస్తున్న పద్ధతి ఐఎఫ్..అంటే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్..అంటే రోజుకు 16 గంటలపాటు లేదా 18 గంటల పాటు ఏమీ తీసుకోకుండా ఉండటం.. తినాలనుకున్న వి ఆ 8 లేదా 6 గంటల్లో తీసుకోవడం.. చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. రిజల్ట్స్ కూడా ఉంటున్నాయి ఓమేరకు.. అయితే ఇప్పుడు ఇది ఎందుకు చెప్పుకోవడం అంటే.. సెలబ్రిటీల బుర్రలు ఈ ఆరోగ్య విషయాల్లో కాస్త విజ్ఞతతో పనిచేయాలి అని చెప్పడానికి.. నర్గీస్ ఫక్రీ.. ఈ బాలీవుడ్ తార పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లులో నటించింది. తను చెబుతోంది ఏదో ఇంటర్వ్యూలో.. "ఏడాదికి రెండుసార్లు సుదీర్ఘ ఉపవాసం ఉంటాను.. 9 రోజుల చొప్పున.. నో ఫుడ్, కేవలం నీళ్లు మాత్రమే.. దాంతో నా ముఖం వికృతంగా మారుతుంది. తరువాత ముఖంలో గ్లో వస్తుంది. హైప్రొటీన్ ఫుడ్ తీసుకుంటాను, నార్మల్ అయిపోతాను.."

## నర్గీస్ ఫక్రీ.. తన ముఖం కాదు..

# ఉపవాసమూ వికృతమే!

సమస్య ఏమిటంటే.. ఈ సెలబ్రిటీలు ఏవో పిచ్చి కూతలు కూస్తారు. పిచ్చి అభిమానులు పాటిస్తారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. 'మామూలుగానే నీ ముఖం వికృతంగా ఉంటుంది కదా, కొత్తగా మారేదేముంది" అని వ్యాఖ్యానించాడు ఓ నెటిజెన్..

నిజమా, సరే, అది వదిలేస్తే.. ఐఎఫ్ వరకూ వోకే.. రోజుకు 16 గంటలో, 18 గంటలో ఏమీ తీసుకోకుండా ఉండటం.. కష్టపడితే ఆచరించవచ్చు.. అదీ సుగర్‌ప్రాబ్లం ఎక్కువగా ఉన్నవాళ్లకు ఇలా చేస్తే సుగర్ లెవల్స్ పడిపోయి కొత్త ప్రాబ్లమ్స్ వస్తాయి కూడా..

వాళ్లు ఏదో కూస్తారు, పాటిస్తారో లేదో ప్రపంచంలో ఎవడికీ తెలియదు, పాటించినా సరే, ఆ పద్ధతులు అందరికీ పనిచేయాలని లేదు, లేదా కొందరికి ప్రాణాల మీదకు తెస్తాయి, ఆ మట్టి బుర్రలకు అది అర్థం కాదు. వాటిని పబ్లిష్ చేసే మీడియాకు అంతకన్నా అర్థం కాదు. ఈమె వికృత సలహాలు పాటించీయమేనా అనడిగితే.. ఓ ఎఐ ప్లాట్‌ఫామ్ ఓ సుదీర్ఘ సమాధానం ఇచ్చింది. సంక్షిప్తంగా చెప్పాలంటే.. తొమ్మిది రోజుల పాటు ఆహారం తీసుకోకపోవడం అనేది సుదీర్ఘ ఉపవాసం. దీనివల్ల ఆరోగ్యానికి చాలా ప్రమాదాలు ఉన్నాయి. తక్కువ సమయం ఉపవాసం ఉండటం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ.., ఎక్కువ కాలం ఆహారం లేకుండా ఉండటం వల్ల కండరాలు క్షీణించడం, అవయవాలు దెబ్బతినడం, చివరికి మరణం కూడా సంభవించవచ్చు. నిజమే.. ముగింపుగా.., తొమ్మిది రోజుల పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు ఉన్నందున ఇది అస్సలు సిఫార్సు చేయబడదు. మరి ఆ పిచ్చిది ఎందుకు చెబుతున్నట్టు..? మీడియా ఎందుకు రాస్తున్నట్టు..? అసలు వీళ్లను కదా 9 రోజులపాటు ఎండబెట్టాల్సింది..!!చెప్పేవాడికి వినేవాడు, రాసేవాడికి చదివేవాడు లోకువ..!!

**- ముచ్చట సౌజన్యంతో...**

**9 రోజుల ఉపవాసం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు...:**

కండరాల క్షీణత (Muscle Wasting), పోషకాహార లోపాలు (Nutrient Deficiencies), అవయవాలు దెబ్బతినడం (Organ Damage), రోగనిరోధక శక్తి బలహీనపడటం (Weakened Immune System), ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలు (Electrolyte Imbalances), మానసిక ప్రభావాలు (Psychological Effects), రీ-ఫీడింగ్ సిండ్రోమ్ ప్రమాదం (Risk of Re-feeding Syndrome)....

## కీరవాణి ఇంట

# విషాదం



టాలీవుడ్‌లో విషాదం నెలకొంది. సినిమా ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ రచయిత శివ శక్తి దత్తా తుది శ్వాస విడిచారు. సోమవారం రాత్రి సమయంలో శివ శక్తి దత్తా మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల నుంచి అధికారిక ప్రకటన వచ్చింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎం ఎం కీరవాణి తండ్రి ఈ శివ శక్తి దత్తా అనే విషయం తెల్సిందే. రచయితగా ఎన్నో సినిమాలకు శివ శక్తి దత్తా పని చేశారు. ముఖ్యంగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన సినిమాలకు శివ శక్తి దత్తా తన రచన సహకారం అందించారు. బాహుబలి సినిమా కోసం మమతల తల్లి, సాహెూరే బాహుబలి పాటలను శివ శక్తి దత్తా రాశారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని థీమ్ సాంగ్‌కి సైతం శివ శక్తి దత్తా సాహిత్యం అందించారు. ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్‌కు స్వయానా అన్న అయిన శివ శక్తి దత్తా ఇండ స్ట్రీలో ఎన్నో రకాలుగా సేవలు అందించారు. కొన్ని వారాల ముందు వరకు కూడా ఆయన పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ యాక్టివ్‌గా కనిపించారు. ఆయన ఇంట ర్వ్యూలు ఎన్నో యూట్యూబ్‌లో ఉంటాయి. విజయేంద్ర ప్రసాద్, రాజమౌళి, కీరవాణి, వల్లి, రమా ఇలా ఫ్యామిలీ మెంబర్స్ అందరి గురించి ఆయన మాట్లాడిన మాటలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ వచ్చాయి. సినిమా ఇండస్ట్రీలో వారి ఫ్యామిలీకి ఉన్న స్థాయి, క్రేజ్ నేపథ్యంలో ఆయన ఇంటర్వ్యూలకు భారీ డిమాండ్ ఉండేది, ఆయన ఇంటర్వ్యూల్లో ఎన్నో విషయాలను తెలియజేస్తూ ఉండేవారు.

1932లో రాజమహేంద్రవరం పక్కన ఉండే కొవ్వూరులో జన్మించిన శివశక్తి దత్తా అసలు పేరు కోడూరు సుబ్బరాజు. చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి కలిగి ఉన్న ఈయన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయి ముంబైలోని ఆర్ట్స్ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత కొవ్వూరు తిరిగి వచ్చిన ఈయన చిత్రకారుడిగా కొన్నాళ్లు కొనసాగారు. ఆ తర్వాత సంగీతంపై ఆసక్తితో గిటార్, సితార్, హార్మోణియం నేర్చుకున్నారు. మద్రాస్‌లో సోదరుడు విజయేంద్ర ప్రసాద్‌తో కలిసి సినిమాల కోసం ప్రయత్నాలు చేశాడు. వీరిద్దరు కలిసి 'జానకి రాముడు' సినిమాకి వర్క్ చేశారు. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో ఇండస్ట్రీలో వీరిద్దరికి మంచి గుర్తింపు లభించింది.

శివ శక్తి దత్తాకు ముగ్గురు సంతానం. కీరవాణి, కళ్యాణి మాలిక్, శివ శ్రీ కంచి. ముగ్గురిలో కీరవాణి, కళ్యాణి మాలిక్ సంగీత దర్శకులగా పరిచయం అయ్యారు. శివ శక్తి దత్తా యొక్క తమ్ముడి కొడుకు రాజమౌళి. ఇండస్ట్రీలో శివ శక్తి దత్తా ఫ్యామిలీకి చెందిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. దర్శకులుగా, నటులుగా, సంగీత దర్శకులుగా, సింగర్స్‌గా కొనసాగుతున్నారు. శివ శక్తి మరణంతో ఆ ఫ్యామిలీ మొత్తం తీవ్ర దుఃఖంలో ఉంది. ఇండస్ట్రీ ప్రముఖులు పలువురు శివ శక్తి దత్తాకు నివాళ్లు అర్పించారు. కీరవాణి, రాజమౌళి అభిమానులతో పాటు, తెలుగు సినిమా ప్రేమికులు శివ శక్తి దత్తాకు సోషల్ మీడియా ద్వారా నివాళ్లు అర్పిస్తున్నారు.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

## సైబర్ స్టేట్‌గా ఒక ద్వీపం..

# బాలాజీ శ్రీనివాసన్ కొత్తబంగారు లోకం!

**పేరులోనే నిత్యానందాన్ని నింపుకున్న ఓ స్వామి ఈక్వెడార్ వద్ద కైలాస అనే కొత్త దేశాన్నే సృష్టించామంటే ఒకింత వెటకారంగా నవ్వుకున్నాంగా? కానీ, ఓ ఇండియన్ బిజినెస్ మ్యాగ్నెట్ ఏకంగా టెకీల కోసమే ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాడన్న వార్తను మరి మీరు నమ్ముతారా..? అవును, అతనే బాలాజీ శ్రీనివాసన్.**

**సింగపూర్ సమీపంలో ఓ ద్వీపాన్ని కొనుగోలు చేసి.. ఏకంగా సాఫ్ట్వేర్ రంగంలోని టెకీలు, ఇన్నోవేటర్స్, ఫౌండర్స్ కోసం ఏకంగా ఓ దేశాన్నే తయారు చేసేందుకు సిద్ధమయ్యాడు శ్రీనివాసన్. నేటి సాంకేతిక రంగంలో డీ సెంట్రలైజ్డ్ డిజిటల్ సొసైటీ రూపకల్పన ఆయన కల. కొత్త కొత్త రంగాలు, కొత్త సాంకేతికత, కొత్త స్టార్టప్ లు వెల్లువలా వస్తున్నప్పుడు.. కొత్త దేశాల రూపకల్పన ఎందుకు సాధ్యం కాదన్నది బాలాజీ శ్రీనివాసన్ ప్రశ్న..?**



కాయిన్ బేస్ మాజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గా పనిచేసిన బాలాజీ శ్రీనివాసన్, కొన్ని సిలికాన్ వ్యాలీ వెంచర్లలో కూడా సహ వ్యవస్థాపకుడు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సాఫ్ట్వేర్ కంపెనీలు, ఐటీ ఇండస్ట్రీ వేళ్లూనుకున్న నేపథ్యంలో.. గతంలోనే, సాఫ్ట్వేర్, ఐటీ, నేటి ఏఐ వంటి అధునాతన టెక్నాలజీనందించే సంస్థలన్నింటిని ఒకే చోట ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న ఒక ప్రయోగాత్మక ఆలోచన శ్రీనివాసన్ లో మొదలైంది. ఆ ఆలోచననే ఇప్పుడు సాకారం చేయడానికి సింగపూర్ వద్ద ప్రత్యేక ద్వీపాన్ని కొనుగోలు చేశాడు శ్రీనివాసన్.

ఈ విషయాన్ని బాలాజీ శ్రీనివాసన్ 'ఎక్స్' లోనూ షేర్ చేశాడు. నెట్వర్క్ స్టేట్‌ను తీర్చిదిద్దే క్రమంలో నెట్వర్క్ స్కూల్‌కు తమ ద్వీపం నిలయమంటూ ఆయన పోస్ట్ కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో రాణించాలనుకునేవారు, అందులో పనిచేస్తున్నవారికి ఈ ద్వీపపు దేశంలో ఏకంగా కృత్రిమ మేథస్సు, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, స్టార్టప్స్ వంటి వాటితో పాటు, ఆరోగ్యంగా చురుకుగా ఉండేందుకు జిమ్ ఫెసిలిటీస్ కూడా కల్పించే విధంగా ప్రయోగాత్మకంగా ఈ మాడల్ దేశాన్ని తయారుచేస్తున్నారు.

తన ఆలోచనను నెట్వర్క్ స్టేట్స్: ఎమర్జింగ్ నేషన్స్ అని చెప్పుకుంటుంటే చాలామంది నయా వలసవాద ప్రాజెక్టుగా కూడా భావించేవారున్నారు. అలాంటి దేశంలో ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు తమతో పనిచేసే కార్పోరేట్ షేర్ హోల్డర్స్ కోసమే పనిచేసే ఒక నియంతృత్వ విధానానికి తెర లేస్తుందనే ఆందోళన మరోవైపు కనిపిస్తోంది.

శ్రీనివాసన్ ఆలోచనలో ప్రధానంగా కనిపించేది ప్రత్యేక ఆర్థిక మండళ్ల వంటి చార్టెడ్ సిటీస్ ఏర్పాటు. అయితే, ఆ కల్పనంతా కూడా పూర్తిగా సాంకేతికంగా ఉండాలనేదే ఆయన ఆకాంక్ష. మనం మన ఇంటర్నెట్ ప్రొవైడర్‌ను ఎంచుకున్నట్టే.. మనకిష్టమైన దేశాలనూ ఎంపిక చేసుకునే సౌలభ్యం భవిష్యత్తులో ఉండాలంటాడు బాలాజీ. అలా సైబర్ కంట్రీస్ పౌరులుగా పౌరసత్వాన్ని సంపాదించే ఒక కొత్త ఆలోచనే నెట్వర్క్ స్టేట్ ఆలోచన.





కొత్త సైబర్ స్టేట్స్ ఏర్పాటు గురించి శ్రీనివాసన్ 2022లోనే తన పుస్తకం ది నెట్వర్క్ స్టేట్ లో వివరించారు. తన కలను బిట్ కాయిన్ శక్తితో ద్వీపాన్ని కొనుగోలు చేసి ఇప్పుడు నిజం చేసుకుంటున్నట్టుగా కూడా శ్రీనివాసన్ తన 'ఎక్స్' పోస్టులో వివరించారు. ఇప్పటికే ఈ ద్వీపంలో ఓ నెట్వర్క్ స్కూల్ ప్రారంభమైంది. ఇక్కడ మూడు నెలల రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టిఫిషియన్ ఇంటలిజెన్స్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, వివిధ రంగాల్లో స్టార్టప్స్ పరిణామ క్రమం వంటివాటిపై శిక్షణనిస్తున్నారు. అలాగే, శారీరక, మానసిక దృఢత్వానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కొనసాగుతోంది.

ఇప్పుడు శ్రీనివాసన్ కొత్త తరహా ఆలోచన టెక్నాలజీ వర్గాల్లో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. మరోవైపు, విమర్శలకూ తావిస్తోంది. ఇప్పటికే అన్ని దేశాలపైనా కార్పోరేట్ శక్తుల ఆధిపత్య ధోరణులు చర్చనీయాంశమవుతున్న కాలంలో శ్రీనివాసన్ ఆలోచన నియంతృత్వ పోకడల వైపు తీసుకెళ్లే ప్రమాదముందనేవారూ కొల్లలు.

### అసలెవరు ఈ బాలాజీ శ్రీనివాసన్.. ?

అమెరికన్ జర్నలిస్ట్ బ్రూస్లీ డికిన్సన్ ను వివాహం చేసుకున్న శ్రీనివాసన్.. న్యూయార్క్‌లోని తమిళ సంతతికి చెందిన వ్యక్తి. తల్లి దండ్రులిద్దరూ వైద్యులు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్, కెమికల్ రెండు ఇంజనీరింగ్ పట్టాలను పొందిన స్కాలర్. గత రెండు దశాబ్దాల నుంచి కౌన్సిల్, ఎర్న్.కామ్, టెలిపోర్ట్‌తో సహా అనేక ఉన్నత స్థాయి టెక్ వెంచర్లలో సహ వ్యవస్థాపకుడిగా ఉన్నాడు. బిట్‌కాయిన్, ఎథెరియం, ఆల్కెమీ వంటి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థల్లో ప్రారంభంలో పెట్టుబడులు పెట్టాడు.

సుమారు 45 ఏళ్ల శ్రీనివాసన్ బాలాజీది విలక్షణమైన శైలి. సంప్రదాయవాదులను రెచ్చగొట్టే తీరులో ఆయన పోకడలుంటాయి. 2024లో ఆగ్నేయాసియాలోని ద్వీపంలో ప్రారంభించిన నెట్వర్క్ స్కూల్ ఇప్పుడు ఆయననుకున్నట్టుగా నడుస్తుండటంతో.. భవిష్యత్తులో దుబాయ్, టోక్యో, మయామీ క్యాంపస్ లపైనా శ్రీనివాసన్ ఫోకస్ పడింది.



### కొత్త బంగారులోకమే శ్రీనివాసన్ ఆలోచన!

ఎలాంటి సరిహద్దుల్లేకుండా క్రౌడ్ ఫండింగ్‌తో ఓ కొత్త సైబర్ ప్రపంచ సృష్టి వెనుక శ్రీనివాస్ ఆలోచనలు భిన్నంగా కనిపిస్తాయి. మొదట ఆన్లైన్‌లో తమ అస్తిత్వం కోసం రిజిస్టరై, ఆ తర్వాత సదరు భూభాగంలోకి ఎంటరై, చివరకు ప్రపంచ గుర్తింపు పొందిన దేశంగా తాననుకున్న సైబర్ స్టేట్‌ను రూపొందించే వినూత్న, ప్రయోగాత్మక ప్రయత్నంతో ఇప్పుడు శ్రీనివాసన్ అడుగులేస్తున్నాడు. నిక్ పీటర్సన్ అనే ఓ కంటెంట్ సృష్టికర్త శ్రీనివాసన్ ప్రత్యేక దేశంగా పేర్కొంటున్న ద్వీపం ఎలా ఉండబోతుందో.. ఒక వర్చువల్ టూర్ విజువల్స్‌ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. నెట్వర్క్‌స్కూల్‌లో ఎలాంటి అనుభవాలుండబోతున్నాయి.. కొత్త దేశాన్ని ఎలా సృష్టించబోతున్నాం.. అక్కడే మేం ఉండాలనే అంశాలపై ఒక స్పష్టమైన కంటెంట్‌తో ఒక వీడియోను కూడా తయారుచేశారు. మొత్తంగా డిజిటల్ యుగంలో అందుకనుగుణమైన సమాజాలను తయారు చేయడం, అలాంటి విధానంలోనే పాలననందించడం, రాబోయే రోజుల్లో తన ప్రయోగం తరహాలోనే కొత్త దేశాల పుట్టుకకు కారణమవ్వడం ఇలాంటి ఎందరికో అంచనాలకు కూడా అందని, ఊహలకు మాత్రమే పరిమితమయ్యే కొత్త బంగారులోకం సృష్టి కోసం శ్రీనివాసన్ అడుగులు మాత్రం కడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

---

## టెక్కలిలో వైఎస్ జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, టెక్కలి)

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు టెక్కలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ నియోజకవర్గ నాయకులతో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 300మంది నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ దివంగత నేత రాజశేఖర్ రెడ్డి పేదల మనసులో దేవుడిగా కొలువై ఉన్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్మోహనరెడ్డికి ప్రతి ఒక్క కార్యకర్త అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి, పాల వసంత రెడ్డి, దుబ్బ వెంకటరావు, ఎంపీపీలు ఆట్ల సరోజినమ్మ, నడుపూరు శ్రీరామమూర్తి, వైకాపా నాయకులు యర్ర చక్రవర్తి, గురునాథ్ యాదవ్, అన్నెపు రామారావు, కురమాన బాలకృష్ణారావు, సత్తారు సత్యం, సుగ్గు రామిరెడ్డి, మార్పు అశోక్ చక్రవర్తి, తమన్న గారి కిరణ్, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపదరావు హేమ సుందర్ రాజు, తమిరి ఫాల్గుణరావు నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులు రాష్ట్ర కమిటీసభ్యులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు నాలుగు మండలాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట మండలం దేవాది పంచాయితీలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న కొబ్బరిమొక్కలు నాటే కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్లపాటు ఎకరాకు రూ. 40వేల చొప్పున రైతులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, శిమ్మ చంద్రశేఖర్, యాళ్ళ వేణుగోపాలరావు, శిమ్మ జగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు, ధర్మాన అసిరినాయుడు, దుంగ గంగరాజు, రఘునాథ్, గొండు సూర్యారావు, ఏపీడీ, ఏంపీడీఓ, ఈఓఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక చేయూత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పి.జగన్నాథంకు 'చేయూత"ను అందించేందుకు హోంగార్డు సిబ్బంది స్వచ్ఛంధగా విరాళం ఇచ్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు నగదు చెక్కు రూ. 4.09లక్షలను ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్నాథం అంకితభావం, నిబద్ధతతో పోలీసు శాఖలో విధులు నిర్వహించారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మరణించిన లేదా ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు "చేయూత"గా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి సీహెచ్ గోపినాథ్, హోంగార్డు ఆర్.ఎస్.ఐ వెంకటరమణ పాల్గొన్నారు.



## దేరశాంలో సుపరిపాలనలో తొలి అడుగు

(సత్యంన్యూస్, రణస్థలం)

మండలంలోని దేరశాం గ్రామంలో మంగళవారం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు లంకా శ్యామ్, మండల పార్టీ కార్యదర్శి కనకారావు, టీడీపీ సీనియర్ నాయకులు పిషిణి జగన్నాథం, కలిశెట్టి సూర్యనారాయణ, ఎంపీటీసీ ధన్నాన వంశీ, ఎంపీటీసీ రాముడు, దుమ్ము అశోక్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, పైడిభీమవరం)

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈనెల 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పైడిభీమవరం పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పైడిభీమవరం జంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఈనెల 9న సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ. 26వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలపాటు కార్మికవర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ నాయకత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం 4 లేబర్‌కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణరంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. బుధవారం జరగబోయే సమ్మె కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి. రమణ, శ్యాంపిస్టన్స్ యూనియన్ నాయకులు ఎం.అప్పలనర్సయ్య, ఎం.కూర్మారావు, జయరాం, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.రామకృష్ణ, బి.సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
















# అత్యుత్సాహం చూపారు.. అడ్డంగా దొరికిపోయారు!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామని చెప్పినప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించకూడదు. ఈ తతంగమంతా ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా జరిగిందనే విమర్శలు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఆర్వో వెంకటేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. ఆ తర్వాత ఏమైందో గానీ డీఆర్వో కాకుండా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారే బదిలీ ప్రక్రియ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగినా ఉన్నతాధికారులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరించడం చర్చనీయాంశమైంది.

**నిబంధనలకు విరుద్ధంగా**

బదిలీలు ఎంత ఏకపక్షంగా జరిగాయంటే.. దరఖాస్తు చేయని పలువురికి స్థానచలనం చేశారు. జిల్లా మంత్రి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే పేరు చెప్పి బదిలీల తంతు కానిచ్చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ కేటగిరీల్లో మొత్తం 21 మందిని బదిలీ చేశారు. వారిలో 11 మంది వార్డెన్లు ఉన్నారు. రాజాం కాలేజీ బాలికల వసతి గృహం వార్డెన్ పావని ఆరేళ్లుగా అక్కడే పని చేస్తున్నారు. అయినా ఆమెకు రిటెన్షన్ ఇచ్చి అక్కడే కొనసాగనిచ్చారు. ఇది బదిలీ మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధం. పలాస కళాశాల బీసీ వసతి గృహం వార్డెన్ ఉపేంద్రను రణస్థలం కాలేజీ వసతి గృహానికి బదిలీ చేసినా అక్కడి నుంచి ఎంఎస్ పల్లికి డిప్యూటేషన్ ఇవ్వడంతో పాటు రాజపురం హాస్టల్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. పోస్టుమెట్రిక్ హాస్టల్ నుంచి ప్రీమెట్రిక్ హాస్టల్‌కు బదిలీ చేయాలన్నా, డిప్యూటేషన్ ఇవ్వాలన్నా ఆ శాఖ డైరెక్టర్ అనుమతి అవసరం. కానీ డైరెక్టరేట్‌కు సమాచారం ఇవ్వకుండానే బదిలీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఉపేంద్రకు ఇచ్చిన పోస్టింగ్ ఆర్డర్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సిఫార్సు మేరకు డిప్యూటేషన్ వేసినట్టు పేర్కొనడం చర్చకు దారి తీసింది. పోస్టింగ్ ఆర్డర్‌లో సిఫార్సు చేసిన ప్రజాప్రతినిధుల పేర్లు పేర్కొనడం ప్రభుత్వ ప్రోటోకాల్‌ను ధిక్కరించడమేనని వాదనలు ఉన్నాయి. వార్డెన్ ఉపేంద్ర డీబీసీడబ్ల్యూవో ఇంటికి అవసరమైన వ్యవహారాలు చూసుకుంటాడని, అందుకే నిబంధనలను తుంగలో తొక్కి అతనికి డిప్యూటేషన్, ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారని చర్చ జరుగుతోంది. రణస్థలం కాలేజీ బాలుర వసతి గృహానికి అదే కేంద్రంలో ఉన్న బాలికల వసతి గృహ వార్డెన్ సీహెచ్ ప్రవీణను నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌ఛార్జిగా నియమించినట్లు విమర్శలు ఉన్నాయి.

**దరఖాస్తు చేయనివారికీ స్థానచలనం**

మండలం యూనిట్‌గా బదిలీలు జరపాలన్న ఆదేశాలు ఉన్నా గుణవతి విషయంలో వాటిని ధిక్కరించారు. రణస్థలం మండలం కేవీ పేట నుంచి జీరుపాలేనికి, అంతకు ముందు జీరుపాలెం నుంచి కేవీ పేటకు బదిలీ చేస్తూ ఏళ్ల తరబడి ఆమెను అక్కడే విధులు నిర్వహించేలా సర్దుబాటు చేస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగి ఆచారి ప్రమేయం, ఒత్తిడితోనే ఆమె విషయంలో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. నరసన్నపేట బీసీ కాలేజీ వసతి గృహ వార్డెన్ బి.రమణను శ్రీకాకుళానికి తీసుకురావడానికి మంత్రి అచ్చెన్నాయుడు సిఫార్సు చేశారని చెబుతూ శ్రీకాకుళం-1 కాలేజీ బాయ్స్ వసతి గృహం వార్డెన్‌గా పనిచేస్తున్న త్రివేణిని.. ఆమె దరఖాస్తు చేయకపోయినా, అర్హత లేకపోయినా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పేరుతో బలవంతంగా నరసన్నపేట కాలేజీ హాస్టల్‌కు పంపించేశారు. శ్రీకాకుళం-4 కాలేజీ బాలికల వసతిగృహ వార్డెన్ లలితను పాతపట్నం బదిలీ చేసి అక్కడ నుంచి ఆమదావలసకు డిప్యూటేషన్ వేశారు. లలిత స్థానంలో పాతపట్నం వార్డెను బదిలీ చేశారు. పాతపట్నానికి ఆమదాలవలస వార్డెన్‌ను తీసుకువచ్చారు. ఇలా బదిలీకి దరఖాస్తు చేయని పలువురిని, వసూళ్ల కోసం మరికొందరిని బదిలీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కారుణ్య నియామకాల్లో మాయ**

ఈ శాఖలో కారుణ్య నియామకాల్లో అవకతవకలకు పాల్పడినట్లు మే 26న గ్రీవెన్స్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణకు కలెక్టర్ ఆదేశించినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు లేకపోగా ఆ జాబితాలో అనర్హుడైన కె.రామారావును ఉంచి ఓకే చేసేశారు. అర్హత ఉన్నా జాబితా నుంచి తప్పించిన బుంజు పాపారావుతో పాటు మరో ఇద్దరి పేర్లు కలిపి కొత్త జాబితా తయారు చేసి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో రెండు రోజుల క్రితం సంతకం చేయించేశారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియలో ఆరుగురినే కారుణ్య కోటాలో నియమించాల్సి ఉండగా ప్రజాప్రతినిధులు చెప్పారంటూ అర్హతలు లేని ముగ్గురిని అదనంగా చేర్చి వ్యవహారాన్ని చక్కబెట్టేశారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి.

# డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం



- కమిషనర్ పీవీడీవీ ప్రసాదరావు
- గారవీధి - తుమ్మావీధి కాలువలు పరిశీలన
- పలుచోట్ల వార్డు పర్యటన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వీధుల్లో కాలువ నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని, డ్రైనేజీ సమస్య తీరుస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. మున్సిపల్ హెల్త్ఆఫీసర్ సుధీర్, గణేష్‌లతో కలిసి మంగళవారం ఉదయం పలు వీధుల్లో కమిషనర్ వార్డుపర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువల్లో షిల్ట్ తొలగింపు పనులు పరిశీలించారు. షిల్ట్ వెంట వెంటనే ఎత్తించే ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. లేకపోతే మరలా కాలువల్లోకి జారిపోయే అవకాశం ఉందన్నారు. అలాగే గారవీధి-తుమ్మావీధి డ్రైనేజీ సమస్యపై పలుమార్లు కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లిన నేపథ్యంలో అక్కడి కాలువలను ఆయన వెళ్లి పరిశీలించారు. చాలా ఏళ్లుగా కాలువ నీరు పోయే మార్గం లేదని, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలపడంతో, ఈ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని, మురుగు నీరు ప్రవహించే ఏర్పాటు చేస్తామని అన్నారు. హెల్త్ఆఫీసర్ సుధీర్ మాట్లాడుతూ రోడ్డుపై రాకపోకలకు అడ్డంగా ఉంచిన మెటీరియల్‌ను క్లియర్ చేయాలని స్థానికులకు తెలిపారు. అలాగే రోజూ వీధుల్లోకి చెత్తను సేకరించే వాహనాలు వచ్చేటప్పుడు ఇంటిలోని అప్పగించాలని సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మేస్త్రి కృష్ణ తదితరులు ఉన్నారు.





# పేద ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్

**- పొందూరులో వైభవంగా వైఎస్సార్ జయంతి -**

(సత్యంన్యూస్, పొందూరు)

పేద ప్రజల గుండె చప్పుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అని వైకాపా కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర సామాజికవర్గ అధ్యక్షులు దుంపల రామారావు అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పొందూరు మండల కేంద్రంలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ జంక్షన్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కేడర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో ప్రవేశపెట్టిన పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదు



- ఇందుకు చారిత్రక ఆధారాలున్నాయి
- సామాజికవర్గంవారు ఎస్టీ సర్టిఫికెట్‌పై వడ్డి 10వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారు
- ఇప్పటి వరకు ఇచ్చిన ఎస్టీ సర్టిఫికెట్లపై దర్యాప్తు జరపాలి
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి

(సత్యంన్యూస్, పలాస)

శ్రీకాకుళం జిల్లా నుంచి బీసీ-ఏకు చెందిన వడ్డి కులస్తులు దాదాపుగా 10వేల మంది వరకు వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, దీనివల్ల నిజమైన ఆదివాసీలు నష్టపోతున్నారని, ఇప్పటికైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి కోరారు. ఈమేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అసలు శ్రీకాకుళంలో బెంతుఒరియా తెగ అనేది లేదని, పలాస రెవెన్యూ డివిజన్ పరిధి కవిటి, కంచిలి మండలాల్లో వడ్డి కులం వారు బెంతు ఒరియా తెగగా చెప్పుకుంటూ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని ఇటీవల హైకోర్టును ఆశ్రయించారని, బిసాయి నరేష్, సుశాంత్ బిసాయి, వైష్ణవి బిసాయిలకు ఆరేళ్లు ఇంటిగ్రేటెడ్ కోర్సు నూజివీడు చదువు వరకే సర్టిఫికెట్ చెందుతుందని హైకోర్టు తెలిపిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియా లేరని చెప్పడానికి అనేక చారిత్రక ఆధారాలు ఉన్నాయని యోగి తెలిపారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు పరిశోధన సంస్థ టీసీఆర్ అండ్ టీఐ ఉమ్మడి రాష్ట్రం హైదరాబాదు నుంచి వచ్చి బెంతు ఒరియాగా చెప్పుకుంటున్న గ్రామాల్లోకి వెళ్లి వారి పండగలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు అధ్యయనం చేసి నివేదికను కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఇచ్చారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియా తెగ అసలు లేదని, 1977లో శ్రీకాకుళం విజయనగరం వేరుపడినప్పుడు ఈ రెండు తెగలు ఇప్పుడున్న మన్యం జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఉన్నాయి తప్ప శ్రీకాకుళంలో లేదని ఆ నివేదికలో పేర్కొన్నట్టు యోగి వివరించారు. ఎస్టీ సర్టిఫికెట్లు ఇక నుంచి ఇవ్వద్దని, ఇచ్చిన వాటిపై కూడా సమగ్ర విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ విభాగం ఇచ్చిన నివేదికలో కోరిన విషయాన్ని గుర్తుచేశారు. 2017లో అప్పటి కలెక్టర్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి బెంతు ఒరియా లేదని నివేదిక ఇచ్చారని, టెక్కలి ఆర్డీవో 1942-43 జననం మరణ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించగా, ఎక్కడ బెంతు ఒరియాగా నమోదు కాలేదని యోగి స్పష్టం చేశారు. ఇన్ని ఆధారాలు ఉన్నా తాత్కాలిక అవసరమని, చదువు అంటూ దొంగ దారిలో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారని యోగి ఆరోపించారు. వడ్డి కులానికి చెందినవారు బెంతు ఒరియా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలంటూ ఆందోళన చేయడం, రాజకీయ పార్టీ నాయకులను కలిసి వాగ్దానాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన ఫేక్ సర్టిఫికెట్లపై తక్షణమే దర్యాప్తు జరిపి, చర్యలు తీసుకోవాలని, గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లన్నీ రద్దు చేయాలని కోరారు. లేదంటే ఆదివాసులు ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందని యోగి హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జిల్లా జేఏసీ జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా సహాయక కార్యదర్శి వెంకటేష్, పాపారావు, సూరపు నాయుడు, భాస్కర్ రావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

# మహా నాయకుడు వైఎస్సార్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అండదండలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన మహా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమదాలవలసలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆమదాలవలస నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చి అన్నదాతలకు అండగా నిలిచి, రాష్ట్రాభివృద్ధిలో కీలక భూమిక పోషించిన వ్యక్తి వైఎస్సార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి గోవింద గోపాల్, లఖినేని నారాయణరావు, బొడ్డేపల్లి రవికుమార్, లఖినేని సాయిరాం, సువ్వారి రమణ, పప్పల అప్పారావు, చింతాడ అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీకాకుళం రోడ్డులో గుంతల రోడ్డుకు ఎప్పటి నుంచో అడ్డంకిగా ఉన్న ఆర్ అండ్ బి కాల్వను తెరిపించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారానికి కొత్తూరు తహసీల్దార్ కె.బాలకృష్ణ పరిశీలించారు. ఇప్పటికే నివగాం రహదారి సమస్యను కొలిక్కి తేవడంపై ప్రజలు హర్షం తెలిపారు. తహసీల్దార్ వెంట వీఆర్వో గిరీష్, మండల సర్వేయర్‌లు ఉన్నారు.

**- సత్యంన్యూస్, కొత్తూరు**

# మా కాలేజ్ గ్రౌండ్ మాకు కావాలి



(సత్యంన్యూస్, పొందూరు)

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కాలేజ్ గ్రౌండ్ కబ్జా జరిగిందని, రాజకీయ పలుకుబడితో కాలేజ్ గ్రౌండ్ కబ్జా చేసినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోలని ఎస్ఎఫ్ఐ నేతలు ఆరోపించారు. ఈమేరకు విద్యార్థులతో కలిసి జి.సిగడం తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ 2012లో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నిర్మించారని, అప్పట్లో గ్రామంలో ఓ భూస్వామి విద్యార్థులకు ఆటస్థలం కోసం ప్రభుత్వానికి స్థలం ఇచ్చారని, దాన్ని రాజకీయ పలుకుబడి ఉన్న ఒక వ్యక్తి 2014లో కబ్జా చేశారని తెలిపారు. 2018లో ఆటస్థలాన్ని కాలేజీకి కేటాయించినట్టు జిల్లా కోర్టు తెలిపినా, లోక్ అదాలత్ ఆ స్థలాన్ని కాలేజీకి కేటాయించాలని తీర్పు ఇచ్చినా, 2025లో ఆ స్థలం మళ్లీ తనదే అంటూ కాలేజీ స్థలంలో గడ్డి కుప్పలు తదితరాలు వేసి వాడుకుంటున్నారని, వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని కాలేజ్ ఆట స్థలాన్ని కాలేజీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున విద్యార్థులను, చుట్టుపక్కల గ్రామ ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు, సహాయ కార్యదర్శి పి.గగేష్, జిల్లా కమిటీ సభ్యులు జయరాం, టౌన్ కమిటీ సభ్యులు రవి, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


# ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 1 నుంచి 50 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెవిన్యూ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్లు జాబితా, క్లెయిమ్స్, బీఎల్‌వో అప్లికేషన్, ఈసీఐ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించారు. శిక్షణలో తహసీల్దార్లు ఎస్.గణపతిరావు, చక్రవర్తి, జి.కె.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# మినీజెట్టి మంజూరుకు కేంద్రమంత్రికి వినతి



**న్యూఢిల్లీ:** శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గనగళ్లవానిపేట వద్ద మినీ జెట్టి నిర్మాణానికి, ఫిష్ లాండింగ్ సెంటర్ మంజూరు చేయమని కేంద్ర మత్స్య శాఖ మంత్రి లాలన్ సింగ్‌కు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వినతి పత్రం అందించారు. రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకార గ్రామాలకు ఈ మినీ జెట్టి వల్ల ఎంతో ఉపయోగం కలుగుతుందని, చేపల నిల్వలకు పనికొస్తుందని, ఈ సదుపాయాలు లేకే మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడుల ప్రత్యేక చొరవతో కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లగలిగామని ఎమ్మెల్యే తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.